
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

సిద్దిపేట
5
మంగళవారం 17 సెప్టెంబరు 2024


టింబర్ డిపోకు తరలించేందుకు పక్కన పెట్టిన దుంగలు

పిల్లల పట్ల జాగ్రత్త వహించాలి

- ఈత సరదా విషాదం కాకూడదు : సీపీ



సిద్దిపేటక్రైం, సెప్టెంబరు 16 : జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు నీళ్లతో నిండుగా ఉన్నాయి. ఈ సమయంలో పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ సూచించారు. ఈత సరదా ప్రమాదంగా మారకూడదన్నారు. ఈత నేర్పించాలనే ఉద్దేశం ఉంటే తల్లిదండ్రులు పిల్లల్ని తీసుకుని వెళ్లాలని ఆమె సూచించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ పిల్లలను ఒంటరిగా, స్నేహితులతో పంపించకూడదని తెలిపారు. పిల్లల కోసం తల్లిదండ్రులు తగు సమయం కేటాయించాలని చెప్పారు. వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని, ఏదైనా ప్రమాదం జరగకముందే జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమమని తెలిపారు. వీలైనంత వరకు పిల్లలను ఇంట్లోనే ఉంచి ఏమైనా కొత్త విషయాలు నేర్పించాలని సూచించారు. పిల్లలను వెంట తీసుకెళ్లినా కూడా వారిపై కన్నేసి ఉంచాలని చెప్పారు.

మున్సిపల్‌లో పుష్పరాజ్‌లు!



- హరితహారంలో లక్షలాది మొక్కలు
- ఏపుగా పెరగడంతో చెట్లను నరికేస్తున్న సిబ్బంది
- చిన్నపాటి కొమ్మలు డంపుయార్డుకు తరలింపు
- మాయమైపోతున్న పెద్దపెద్ద దుంగలు
- సిద్దిపేటలోని ఓ టింబర్ డిపోకు తరలింపు
- క్వింటాలుకు రూ. 5వేల చొప్పున విక్రయం
- సొమ్ముచేసుకుంటున్న అధికారులు, సిబ్బంది!
- పట్టించుకోని ఫారెస్ట్, మున్సిపల్ ఉన్నతాధికారులు

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు 16 : పర్యావరణాన్ని కాపాడాల్సిన అధికారులు, సిబ్బంది.. ఆ పచ్చని పర్యావరణం సాక్షిగా అవినీతికి పాల్పడుతూ తాము పుష్ప సినిమాలోని సన్నివేశాలకు తక్కువేమి కాదంటూ నరికిన చెట్ల దుంగలను అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు!!


సిద్దిపేట జిల్లా కేంద్రంలో కొన్నేళ్ల క్రితం హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయి. అయితే ఇప్పుడు పలు కారణాలు చూపుతూ అధికారులు చెట్లను కొంతభాగం నరికివేయాలని సిబ్బందికి ఆదేశాల జారీ చేశారు. కొంతభాగమే నరికివేయకుండా కొన్ని చోట్ల చెట్ల మధ్య వరకు, ఒక్కోచోట అసలు చెట్టే లేకుండా నరికేస్తున్నారు. చెట్లను కొమ్మలను తీసేసి పెద్ద మొద్దులుగా ఉన్న వాటిని పట్టణంలోని ఓ టింబర్ డిపోకు తరలించి క్వింటాలుకు రూ.4వేల నుంచి రూ.5వేల చొప్పున అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

సిద్దిపేటలో లక్షలాది మొక్కలు

ఆకుపచ్చ సిద్దిపేటగా మార్చాలన్న సంకల్పంతో గత ప్రభుత్వ హయాంలో హరితహారంలో భాగంగా లక్షలాది మొక్కలను దశలవారీగా నాటారు. ఇప్పటివరకు దాదాపుగా 19 లక్షలకు పైగా మొక్కలను సిబ్బంది సంరక్షించడంతో పెరిగి చెట్లుగా మారాయి.

నిబంధనలు గాలికి

చెట్ల కొమ్మలు కరెంటు తీగలకు అడ్డుగా వస్తున్నాయని విద్యుత్, మున్సిపల్ అధికారుల ఆదేశాల మేరకు కొమ్మలతో పాటు చెట్ల మధ్య వరకు సిబ్బంది నరికేస్తున్నారు. అయితే మొక్కలు, చెట్లు కొమ్మలను నరికివేయాలంటే ఫారెస్టు అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. కానీ అవేమి పట్టించుకున్న దాఖలాలు లేవు.


చెట్టును నరికి మొదలు కాల్చిన దృశ్యం


సిద్దిపేటలో చెట్ల మధ్య వరకు నరుకుతున్న సిబ్బంది


చెట్లను మధ్యకు నరికిన సిబ్బంది

రాత్రికి రాత్రే టింబర్ డిపోకు..

చెట్లను నరికిన తర్వాత వాటిని సిద్దిపేటలోని ఓ టింబర్ డిపోకు తరలించి క్వింటాలుకు రూ. 5వేల చొప్పున విక్రయిస్తూ అధికారులు, సిబ్బంది సొమ్ముచేసుకుంటున్నారు. నరికివేసిన చెట్ల నుంచి కొమ్మలను, మొద్దులను వేరుచేసి ఉంచుతున్నారు. ఆ కొమ్మలను చెత్త సేకరణకు వస్తున్న మున్సిపల్ సిబ్బంది డంపింగ్‌యార్డుకుతరలిస్తున్నారు. మొద్దులను మున్సిపల్‌కు చెందిన మరో వాహనం వచ్చి గుట్టుచప్పుడు కాకుండా రాత్రికి రాత్రే టింబర్ డిపోకు తరలిస్తున్నారు. ఇప్పటివరకు కొన్ని టన్నుల మేర తరలించి సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. గతంలో నాటిన ఫిల్టోరియామెంథాలిస్ (పేపర్ తయారయ్యేది) చెట్టును తీసివేయాలని అధికారులు అధికారింగా ఆదేశాలిచ్చినా, ఆ చెట్లను అమ్మిన డబ్బును ఇంతవరకు మున్సిపల్ ఖాతాలో జమచేయలేదని ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. పట్టణంలో పలు వ్యాపార దుకాణ సముదాయాలకు అడ్డుగా ఉండటంతో వాటిని పూర్తిగా తీసేందుకు సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తూ చెట్లను పూర్తిగా నరికివేస్తున్నారు.

కొరవడిన పర్యవేక్షణ


సిద్దిపేటలోని ఓ షాపింగ్ కాంప్లెక్స్ ముందు ఆనవాళ్లు లేకుండా మొక్కలను తొలగించిన దృశ్యం

గత కొన్నినెలల నుంచి సిద్దిపేటలో పలు శాఖల అధికారులు, సిబ్బంది పనితీరు చూస్తుంటే వారు ఆడింది ఆట, పాడింది పాట అన్నట్టుగా కనిపిస్తున్నది. పట్టణంలో చెట్లను ఇష్టానుసారంగా ఎలాంటి అనుమతి లేకుండా నరికివేస్తున్నా పర్యవేక్షించాల్సిన ఫారెస్ట్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారంటూ పర్యావరణ ప్రేమికులు మండిపడుతున్నారు. ఎన్నో ఏళ్లుగా కంటికిరెప్పలా కాపాడుకున్న చెట్లను నరికివేస్తుండటంతో ఎమ్మెల్యే హరీశ్‌రావు సంబంధిత అధికారులపై మండిపడిన సంగతి తెలిసిందే. మున్సిపల్‌లో ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో చెట్లను ఎవరు కూడా కొట్టవద్దని, కొమ్మలను మాత్రమే తీసేయాలని ఆదేశాలిచ్చినా కూడా అవేమి పట్టనట్టు కొంత మంది సిబ్బంది కాసులకు కక్కుర్తిపడి చెట్లను ఇష్టానుసారంగా నరికేస్తున్నారు.


ఓ దుకాణం ఎదుట చెట్టు అడ్డుగా ఉండటంతో డబ్బు తీసుకుని తొలగించి కాల్చేసిన దృశ్యం

కోడ్ ఒకటి

యాప్‌లు పది

- ప్రయాణికులకు మరింత చేరువగా ఆర్టీసీ సేవలు

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 16: ఆర్టీసీ రోజురోజుకూ ఆధునికతను అందిపుచ్చుకుంటుంది. ఇప్పటికే సాంకేతిక ఆధారంగా సీట్ల రిజర్వేషన్లు, డిజిటల్ లావాదేవీలను విజయవంతంగా నిర్వహిస్తున్నది. ఈ క్రమంలో ప్రైవేట్ బస్సుల నుంచి పోటీని తట్టుకునేందుకు ఓ కొత్తయాప్‌ను ప్రవేశపెట్టింది. ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ప్రత్యేకంగా క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. కోడ్‌ను మరింత ఆధునీకరించి పది యాప్‌లను అనుసంధానం చేశారు. క్యూఆర్ కోడ్ సాయంతో ఉన్నచోట నుంచే ఆర్టీసీ సేవలు పొందే వీలుంటుంది. ఆన్‌లైన్‌లో టికెట్ బుకింగ్ వెబ్‌సైట్, గమ్యం, ఆన్‌లైన్ బుకింగ్ యాప్, ఇన్‌స్టాగ్రాం, ఎక్స్ ట్విట్టర్, యూట్యూబ్, ఫేస్‌బుక్, వాట్సాప్‌తో పాటు మరో రెండు యాప్‌లు ఉండనున్నాయి. ఆండ్రాయిడ్, ఐవోఎస్ వినియోగదారులకు యాప్‌లు వేర్వేరుగా ఉండనున్నాయి. ఈ క్యూఆర్ కోడ్‌ను ప్రస్తుతం అన్ని ఆర్టీసీ బస్టాండ్లలో అందుబాటులో ఉంచారు. ప్రయాణికులు ఆ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు. ఒకసారి మెయిల్ ఐడీ, పాస్‌వర్డ్ ఇచ్చి పొందుపరిస్తే ఎప్పుడైనా వినియోగించుకోవచ్చని సిద్దిపేట డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి తెలిపారు.

గంగమ్మ ఒడికి గణనాథులు

- నేడు పెద్దఎత్తున తరలనున్న బొజ్జగణపయ్యలు
- ఏర్పాట్లను పరిశీలించిన పోలీసులు, అధికారులు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 16 : ఆదివారం మొదలైన వినాయక నిమజ్జనాలు సోమవారం కూడా కొనసాగాయి. నిమజ్జనంతో మహిళల కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. మంగళవారం పెద్ద ఎత్తున గణపతులు నిమజ్జనానికి తరలనున్నాయి. పట్టణంలోని కోమటిచెరువును అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, ఏసీపీ మధు, మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీబాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, వివిధ శాఖల అధికారులు పరిశీలించి పలు సూచనలు చేశారు.

అప్రమత్తంగా ఉండాలి

జిల్లావ్యాప్తంగా 1050 పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని సీపీ అనురాధ తెలిపారు. నిమజ్జనం సమయంలో నిర్వాహకులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏమైనా సమస్యలు తలెత్తితే కమిషనరేట్ పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712667100కు లేదా డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు.


నిమజ్జనంలో బ్యాండు వాయిస్తున్న యువతి


సిద్దిపేటలో కోమటిచెరువలో గంగమ్మ ఒడికి చేరుతున్న గణపయ్య


అష్టోత్తర శతకలశాభిషేకంతో నిమజ్జనం చేస్తున్న మహిళలు

అష్టోత్తర శత కలశాభిషేకంతో నిమజ్జనం

సిద్దిపేటలోని గణేష్ నగర్ ప్రసన్నాంజనేయ స్వామి చారిటబుల్ ట్రస్ట్, ప్రసన్నాంజనేయ స్వామి మహిళా గోష్టి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మట్టి గణపతికి వినూత్నంగా నిమజ్జన పూజాక్రతువు జరిపారు. పట్టణ పురవీదుల్లో 108 కలశాలతో మహిళలు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం వినాయకుడి మండపంలో ప్రతిమను పెట్టి పూజచేసిన 108 కలశాలతో స్వామివారి ప్రతిమకు అభిషేకం చేసి గణపయ్యను నిమజ్జనం చేశారు.

తెలంగాణ ప్రజాపాలన దినోత్సవానికి

ఏర్పాట్లు పూర్తి

- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న మంత్రి పొన్నం

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 16: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సెప్టెంబరు 17ను 'తెలంగాణ ప్రజాపాలన' దినోత్సవంగా జరపాలని నిర్ణయిస్తూ 2024 సెప్టెంబరు 11న అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు తెలంగాణ ప్రజాప్రాలన దినోత్సవాన్ని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఘనంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై జాతీయ జెండాను ఎగురవేయనున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగిస్తారు.



సిద్దిపేటలోని డిగ్రీ కళాశాల మైదానంలో సిద్ధమైన వేదిక


దుబ్బాక చేనేత వస్త్రంతో అయోధ్య బాలరాముడు

అయోధ్య బాలరాముడికి

దుబ్బాక చేనేత వస్త్రం


దుబ్బాక, సెప్టెంబరు 16: దుబ్బాక చేనేత వస్త్రానికి మరోసారి అరుదైన అవకాశం లభించింది. రెండునెలల క్రితం అయోధ్య బాలరాముడిని అలంకరించేందుకు లెనిన్ ఇక్కత్ డిజైన్ గులాబీ వర్ణం వస్త్రాన్ని అందించిన దుబ్బాక చేనేత కార్మికులు.. స్వామివారి అలంకరణ కోసం జరీఅంచు లెనిన్ ఫ్యాబ్రిక్ శ్వేత వస్త్రాన్ని అందించారు. ఈ వస్త్రాన్ని డిల్లీలోని ముక్తిర్ ఫ్యాషన్ డిజైన్ ఇండియా లిమిటెడ్ సంస్థ దుబ్బాక చేనేత కార్మికుల నుంచి కొనుగోలు చేయగా, అయోధ్య ట్రస్టు వారు సోమవారం స్వామివారిని ఈ వస్త్రంతో అలంకరించారు. దుబ్బాకకు చెందిన చేనేత వస్త్రాన్ని ఇటీవల కూడా బాలరాముడికి అలంకరించారు. ఈ ప్రాంత చేనేత కార్మికులు నేసిన వస్త్రాలకు మూడుసార్లు అవకాశం రావడంతో దుబ్బాక చేనేత సహకార సంఘం మాజీ చైర్మన్ బోడ శ్రీనివాస్ హర్షం ప్రకటించారు.

అజరామరం వీరుల త్యాగఫలం

- పోరులో అసువులు బాసిన యోధులు
- సాయుధ పోరాటానికి ఊపిరి పోసిన గ్రామాలెన్నో..

హుస్నాబాద్/చేర్యాల/మద్దూరు,సెప్టెంబరు 16 : నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన సాయుధ పోరాటంలో ఎందరో తమ ప్రాణాలను పణంగా పెట్టారు. పల్లెలను వల్లకాడుగా మారుస్తున్న నిజాం పాలనపై తిరుగుబాటు జెండా ఎగురవేసి తెలంగాణ ప్రజలకు విముక్తి కలిగించారు. ఆనాడు జరిగిన పోరాటాలు, నెత్తుటి జ్ఞాపకాలలో కొన్నింటిని సెప్టెంబరు 17 సందర్భంగా మననం చేసుకుందాం.

నిజాం సర్కారు నిరంకుశ పాలన నుంచి విముక్తి కలిగించడానికి సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో హుస్నాబాద్ ప్రాంత పోరాట వీరులు ముఖ్య భూమికను పోషించారు. నిజాం పోలీసులైన రజాకార్లను తరిమికొట్టిన గ్రామాలు ఈ ప్రాంతంలో ఎన్నో ఉన్నాయి. అందులో మొదటి సాయుధ పోరాట యోధుడు, నిజాంపై రణభేరి మోగించిన అనభేరి ప్రభాకర్‌రావు. బానిస సంకెళ్లను తెంచడానికి సాయుధ పోరాటమే మార్గంగా ఎంచుకున్న విప్లవకెరటం ఆయన. హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్ గుట్టల్లో 1948 మార్చి 14న రజాకార్లతో జరిగిన పోరులో అనభేరి ప్రభాకర్‌రావు, ఆయన సహచరుడు భూపతిరెడ్డి పాటు మరో 12 మంది నేలకొరిగారు. తెలంగాణ ప్రాంతంలో ఇదే మొదటి ఎన్‌కౌంటర్. నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా తొలిసాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన ప్రభాకర్‌రావు పోరాట గాథలు ఇప్పటికీ ఇక్కడ మారుమోగుతూనే ఉంటాయి.


చేర్యాల మండలంలం షబాషీగూడెంలో రజాకార్లు క్యాంపు ఏర్పాటు చేసుకున్న గడి

రజాకార్లను ఎదురించిన వీరభూమి

తెలంగాణ రైతాంగసాయుధ పోరాటంలో చేర్యాల, కొమురవెల్లి మండలాల్లోని పలు గ్రామాలు కీలకభూమిక పోషించాయి. ఉద్యమాలకు ఊపిరిగా నిలిచాయి. సాయుధపోరాటానికి ప్రతీక అయిన మద్దూరు మండలం భైరాన్‌పల్లి తరువాత ప్రాధాన్యం కలిగింది చేర్యాల మండలంలోని వీరన్నపేట, నాగపురి, ఆకునూరు గ్రామాలే. నిజాం నిరంకుశత్వ పాలన ప్రతిఘటనకు ఆరుట్ల రాంచంద్రారెడ్డి, కుర్రారం రాంరెడ్డి చేర్యాల ప్రాంత నేతృత్వం వహించారు. సాయుధపోరాటంలో మరణించిన వారి త్యాగాన్ని గుర్తించాల్సిన పాలకులు పట్టించుకోకపోవడంతో అమరుల కుటుంబాలు చేయూత కోసం ఎదురుచూస్తున్నాయి. నల్లగొండ జిల్లాలో పోరాటం కొనసాగిన క్రమంలో వరంగల్ జిల్లాలో చేర్యాల విలీనమవడంతో సంబంధిత రికార్డులు అందుబాటులో లేవు. దీంతో పింఛన్లు, ఇతర రాయితీలు పొందడానికి ఇప్పటికీ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. నేటితరానికి నాటి పోరాటం తెలియచేసేందుకు పాఠ్యాంశంగా చేర్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


మహ్మదాపూర్‌లో నిర్మించిన అనభేరి ప్రభాకర్ స్తూపం


గ్రామ రక్షణలో బురుజులది కీలక పాత్ర

సర్వాయి పాపన్న హయాంలో గ్రామాల ధీరత్వానికి ప్రతీకగా నిర్మితమైన బురుజులు కాలక్రమేణా పిండారీల దోపిడీలను ఎదుర్కోవడంతో పాటు నిజాం రజాకార్ల దౌర్జన్యాలను, అరాచకాలను ఎదురునిలిచే అడ్డాలుగా ప్రముఖపాత్ర పోషించాయి. అప్పటి జనగామ తాలూకాలోని ఇప్పటి మద్దూరు ఉమ్మడి మండలంలోని ముస్లిం గ్రామాలైన సలాఖ్‌పూర్, మద్దూరు, లద్నూరు కేంద్రాలుగా చేసుకుని పచ్చని పంట పొలాలతో విలసిల్లుతున్న గ్రామాలపై రజాకార్లు పడి దోచుకుంటూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. భైరాన్‌పల్లి, దూళిమిట్ట, తోర్నాల కొండాపూర్, కూటిగల్, లింగాపూర్, వల్లంపట్ల, రేబర్తి, ధర్మారం, సలాఖ్‌పూర్, వంగపల్లి, గాగిళ్లాపూర్ నర్సాయపల్లి గ్రామాల్లోని నడిబొడ్డున నిర్మితమైన బురుజులను గ్రామస్థులు రక్షణ కేంద్రాలు చేసుకున్నారు. బురుజుపైకి వెళ్లడానికి మనిషి దూరేంత సందు మాత్రమే ఏర్పాటు చేసుకునేవారు. శత్రువు తల దూరిస్తే ఒక్క వేటుతో తల నరికే వ్యవస్థను సైతం ఏర్పాటు చేసుకున్నారు. బురుజుపై నాటుతుపాకులు, తుటాలు, వడిసెలు, ఈటెలు, రాళ్లు, సలసల కాగే నీళ్లు సిద్ధం చేసుకోవడంతో పాటు జెజ్జాయి పేరుతో ఫిరంగిని ఏర్పాటు చేసుకున్నారు. ఆమడ దూరంలో ఉన్న శత్రువుల రాకను గమనించి బురుజుపై ఏర్పాటు చేసిన నగారా మోగించి చుట్టుపక్కల గ్రామాల ప్రజలను మేల్కొలిపి అందుబాటులో ఉన్న ఆయుదాలతో పొలిమేర నుంచే శత్రువులను తరిమికొట్టేవారు. బురుజులు గ్రామ రక్షణలో ఘనమైన పాత్ర వహించాయి. నేటికి వీటి రక్షణకు పాలకులు కనీస మరమ్మతులు చేపట్టకపోవడంతో శిథిలమవుతున్నాయి. చరిత్రకు సాక్షంగా నిలిచిన బురుజులను కాపాడి ముందు తరాలకు వీటి గూర్చి వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


మద్దూరు మండలంలోని భైరాన్‌పల్లి బురుజు

రుద్రారంలో పోస్టర్ కలకలం

- మావోయిస్టు జగన్ ఎన్‌కౌంటర్‌కు నిరసన
- ఆకతాయిల పనేనంటున్న పోలీసులు



మిరుదొడ్డి, సెప్టెంబరు 16: సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట- భూంపల్లి మండలం రుద్రారంలో సోమవారం మావోయిస్టు పేర వెలసిన పోస్టర్ కలకలం సృష్టించింది. అటు పోలీసులను, ఇటు ప్రజలను ఉలిక్కిపడేలా చేసింది. ఇటీవల మరణించిన మావోయిస్టు జగన్ ఎన్‌కౌంటర్‌కు ప్రభుత్వం మూల్యం చెల్లించుకుంటుందని అందులో హెచ్చరించారు. జగన్‌తోపాటు మరికొంతమంది మావోయిస్టులను పట్టుకుని కోర్టుకు హాజరుపర్చకుండా మట్టుపెట్టారని అందులో ఆరోపించారు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూల్యం చెల్లించక తప్పదన్నారు. కొందరు ఇన్‌ఫార్మర్లకు త్వరలోనే బుద్ధి చెబుతామని అందులో పేర్కొన్నారు. అయితే, ఇది ఆకతాయిల పనేనని, ఎలాంటి మావోయిస్టు కార్యకలాపాలు లేవని పోలీసులు తేల్చి చెబుతున్నారు. ఇందుకు సంబంధించి అనుమానితుడిగా గ్రామానికి చెందిన ఒక యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది.



నేడు చక్రియాల్‌లో అనంత చతుర్దశి



దిండి కార్యక్రమంలో భక్తులతో కలిసి పాదయాత్ర చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పుల్‌కల్, సెప్టెంబరు 16: చౌటకూర్ మండలం చక్రియాల గ్రామంలో 17న శ్రీలక్ష్మీ అనంతపద్మనాభస్వామి చతుర్దశి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అతి పురాతనమైన ఆలయంలో అభిషేకాలు, పూజలు చేపట్టనున్నారు. ఉదయం 7.30 గంటలకు స్వామివార్లకు అభిషేకం, మహా పూజలు, అనంత వ్రతాలు జరగనున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆలయ ప్రధాన అర్చకులు మహారాజుల రామకృష్ణశర్మ, నిర్వాహకుడు లక్ష్మణ్ కోరారు.

సంజీవన్‌రావుపేటలో 'దిండి'

నారాయణఖేడ్, సెప్టెంబరు 16: ఖేడ్ మండలం సంజీవన్‌రావుపేటలో అఖండ హరినామ సప్తాహ ముగింపులో భాగంగా సోమవారం పాండురంగ విఠలేశ్వరుడి దిండి కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు సాయిరెడ్డి, ఎంపీటీసీ భూపాల్ భక్తులతో దిండి పాదయాత్రలో పాల్గొన్నారు.



చక్రియాల గ్రామంలోని శ్రీలక్ష్మీ అనంతపద్మనాభస్వామి ఆలయం

శివాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

జిన్నారం, సెప్టెంబరు 16: మంగంపేటలో నిర్మిస్తున్న శివాలయానికి మంగంపేటకు చెందిన జంగం వీరప్ప కుటుంబసభ్యులు సోమవారం ఆలయ నిర్మాణ పనుల కోసం రూ.లక్షను నాయకులు మల్లేశం, నరేందర్, రఘు, లక్ష్మణ్, వెంకటేశ్, శేఖర్‌రెడ్డిలకు అందజేశారు.

మద్యం మత్తులో మహిళ వీరంగం

● వాహనాల రాకపోకలకు అంతరాయం



పట్టణంలోని భవానీ మందిర్ చౌరస్తా వద్ద బస్సును అడ్డుకుంటున్న మహిళ

జహీరాబాద్, సెప్టెంబరు 16: మద్యం మత్తులో మహిళ వీరంగం సృష్టించింది. జహీరాబాద్ పట్టణంలోని భవానీ మందిర్ చౌరస్తా వద్ద వాహనాలను అడ్డగిస్తూ ఇబ్బందులకు గురి చేసింది. సుమారు గంట పాటు ఈ తతంగం జరిగింది. వాహనాలకు అడ్డు తగలడంతో కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. చుట్టుపక్కల వారు, బస్సు డ్రైవర్ పరిస్థితులను గమనించి ఆమెకు సర్దిచెబుతూ పక్కకు తరలించారు. దీంతో వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు.

'పూజారులకు గౌరవ వేతనం చెల్లించాలి'


నారాయణఖేడ్, సెప్టెంబరు 16: గిరిజనతండాల్లోని భవానీమాత, సేవాలాల్ మహరాజ్ ఆలయాల పూజారులకు దూపదీప నైవేద్య పథకంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలను చెల్లించాలని ఖేడ్ తాజామాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్ కోరారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మూడేళ్లుగా గౌరవ వేతన చెల్లింపులు నిలిచిపోయాయని తెలిపారు. కలెక్టర్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి స్పందించి గౌరవ వేతనాలు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

జిల్లాస్థాయి పోటీలకు 'ఆక్స్‌ఫర్డ్' విద్యార్థులు

జోగిపేట, సెప్టెంబరు 16: జోగిపేట పట్టణానికి చెందిన ఆక్స్‌ఫర్డ్ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన మశ్చేందర్, గిరిధర్‌లు అండర్-17 బాలుర కబడ్డీ విభాగంలో జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. కాగా అండర్-14 బాలుర విభాగంలో శ్రీకాంత్, అండర్-17 బాలుర విభాగంలో దుర్గాప్రసాద్, అండర్-17 బాలికల విభాగంలో అసిఫా, అండర్-14 బాలికల వాలీబాల్ పోటీల్లో మధురిమలు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని వ్యాయామ ఉపాధ్యాయులు నర్సింహులు, భానుతేజ అభినందించారు.





















కొత్త యంత్రాలను అభివృద్ధి చేస్తా



నాన్న శ్రీనివాస్‌రెడ్డి హెడ్ కానిస్టేబుల్, అమ్మ విజయ గృహిణి. మిడ్ మానేరు దగ్గర మాకు కొంత పొలం ఉన్నది. అప్పుడప్పుడు అమ్మ నాన్న పొలం దగ్గరికి తీసుకెళ్లేవారు. అప్పుడు రైతుల పరిస్థితిని గమనించేదాన్ని. 2014-2018 బ్యాచ్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేశాను. రోజుకు 12 గంటలపాటు చదివి ఏఈఈ ఉద్యోగం సంపాదించాను. తక్కువ ఖర్చుతో వ్యవసాయానికి ఉపయోగపడేలా కొత్త యంత్రాలను అభివృద్ధి చేసి రైతులకు అందిస్తా.

-గోలి సంజన, కరీంనగర్



కంది వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల వద్ద అధ్యాపకులతో ఏఈఈ ఉద్యోగం పొందిన పూర్వ విద్యార్థులు

కొలువుల కళాశాల

78 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు

● 100 పోస్టుల్లో 78 కంది వ్యవసాయ కళాశాల విద్యార్థులకే..

కంది, సెప్టెంబరు 16 : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. 2011 నుంచి 2018 బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులు నీటి పారుదల శాఖలో 78 ఏఈఈ (అగ్రికల్చర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్)లుగా ఉద్యోగాలు సాధించారు. 2022 సెప్టెంబరు 15న 100 ఏఈఈ పోస్టులకు నోటిఫికేషన్ వెలువడిగా, రాష్ట్ర వ్యాప్తంగా వందలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. దీనికి సంబంధించి 2023 మే 9న పరీక్ష నిర్వహించగా, 2024 జూన్ 23న ఫలితాలు వచ్చాయి. 100 ఏఈఈ పోస్టుల్లో 78 కంది వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకే దక్కగా, అతి త్వరలో కొలువుల్లో చేరనున్నారు. వ్యవసాయ రంగంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకొస్తామని ఈ యువ ఇంజనీర్లు గర్వంగా చెబుతున్నారు. అధునాతన పరిజ్ఞానంతో రూపొందించిన యంత్రాలను అందుబాటులోకి తెస్తామని, పాలీహౌస్‌లను ప్రోత్సహించి రైతులకు పంటల ధరలు నిర్ణయించడంలో తమవంతు సహకారం అందిస్తామని వారు పేర్కొంటున్నారు

రోజుకు పది గంటలు చదివా



మాది నల్లగొండ జిల్లా. నాన్న జగన్నాథం, అమ్మ జయమ్మ ఇద్దరూ చేనేత వస్త్రాలు నేస్తారు. మా చుట్టుపక్కల రైతుల కష్టాలు చూసి వ్యవసాయంలో ఇంజనీరింగ్‌ను ఎంచుకున్నాను. 2015-2019 బ్యాచ్‌లో కంది పరిధిలోని వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో నా చదువును పూర్తి చేశాను. ప్రభుత్వ ఉద్యోగం సంపాదించడమే లక్ష్యంగా పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యాను. రోజుకు 10 గంటలు పట్టుదలతో చదివాను. నా కష్టానికి ఫలితంగా ఏఈఈ ఉద్యోగం రావడం చాలా ఆనందంగా ఉన్నది. రైతులకు నేస్తంలా ఉంటూ వారికి వ్యవసాయ రంగంలో మెళకువలు నేర్పిస్తా. పంటల్లో నూతన ఒరవడిని వివరించి అన్నదాతలకు మేలు జరిగేలా చూస్తా.

-చిలుకూరి ప్రమీల, చండూరు, నల్లగొండ

నీటి వినియోగంపై రైతులకు శిక్షణ ఇస్తా



నాన్న వెంకట్రావు తాపీ మేస్త్రి. అమ్మ యశోద గృహిణి. అద్దె ఇంటిలో ఉంటూ నాన్న రోజు పడే కష్టం చూడలేకనే ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని నిర్ణయించుకున్నా. 2014-2018 బ్యాచ్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేశాను. అనంతరం ఒక సంవత్సరం పాటు అశోక్‌నగర్‌లోని ఓ స్టడీ సర్కిల్‌లో కోచింగ్ తీసుకుని ఏఈఈ ఉద్యోగం సాధించాను. చెరువుల కింది ఆయకట్టు రైతులకు నీటి వినియోగంపై శిక్షణ ఇస్తా. వ్యవసాయ రంగంలో ఆధునికతను ఉపయోగించి అన్నదాతలకు తోడ్పాటు అందిస్తా.

- కుంచాల ఉమా మహేష్, నాగోల్, హైదరాబాద్

చెరువు నీటి వృథాను అరికడుతా...



నాన్న సత్యారెడ్డి రైతు. అమ్మ కరుణ గృహిణి. మాది వ్యవసాయ కుటుంబం కావడంతో ఇంట్లో ఎక్కువగా వ్యవసాయం గురించే చర్చలు జరిగేవి. దీంతో వ్యవసాయ రంగంలో కొత్త ఒరవడి సృష్టించడానికి 2014-2018 బ్యాచ్‌లో కంది వ్యవసాయ కళాశాలలో ఇంజనీరింగ్ పూర్తి చేశాను. గంటల తరబడి చదివి ఏఈఈ ఉద్యోగం సాధించా. వ్యవసాయంలో నూతన ఆవిష్కరణలపై దృష్టి సారిస్తా. రైతులకు నేస్తాంలా ఉంటూ చెరువుల్లోని నీరు వృథా కాకుండా చూస్తాను.

-హర్షవర్ధన్ రెడ్డి, మాందాపూర్, వనపర్తి

రోడ్డును బాగుచేయండి

● రోడ్డెక్కి ఆందోళన చేసిన గ్రామస్థులు
● ఓవర్‌లోడ్ లారీలతోనే పాడవుతున్నాయని ఆరోపణ
● సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ హామీతో ఆందోళన విరమణ
● రైల్వే గేటును మూసి వేయొద్దు : నాగిరెడ్డిపల్లి గ్రామస్థులు

జహీరాబాద్/కోహీర్, సెప్టెంబరు16 : పాడైన రోడ్లకు మరమ్మతులు చేయడంలో అధికారులు, పాలకులు విఫలమయ్యారని, వెంటనే రహదారులను బాగుచేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని అల్గోల్ గ్రామస్థులు సోమవారం ఆందోళనకు దిగారు. అధికారులు, నాయకులు ఇక్కడకు వచ్చేవరకూ ఆందోళనను విరమించబోమన్నారు. అల్గోల్‌చౌరస్తా నుంచి పొట్టిపల్లి మీదుగా ఎల్గోయి వరకు రోడ్డు అధ్వానంగా మారిందన్నారు. నాయకులకు, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన ఓ కంకర మిక్సింగ్ కర్మాగారం నుంచి ఓవర్‌లోడ్‌తో లారీలు నిత్యం ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగిస్తుండడంతో దారి గుంతలమయంగా మారిందని ఆరోపించారు. ఆ కర్మాగారం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలన్నారు. విషయం తెలుసుకున్న సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డా.సిద్దం ఉజ్వల్ రెడ్డి అక్కడికి చేరుకుని సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడారు. రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామని వారు హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.

రైల్వే గేటు మూస్తే తీవ్ర అంతరాయం..

కోహీర్ మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ శివారులోని 20వ నంబరు రైల్వే గేటును మూసివేస్తే రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని నాగిరెడ్డిపల్లి ప్రజలు రైల్వే అధికారులకు తమ సమస్యను వివరించారు. సోమవారం రైల్వే అధికారులు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, మండల సర్వేర్ ఆధ్వర్యంలో ఆ రైల్వే గేటు వద్ద అండర్ బ్రిడ్జి ఏర్పాటుపై సర్వే నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి చేరుకొని రైల్వే గేటు మూసివేస్తే తమకు ఇబ్బంది అవుతుందని మొరపెట్టుకున్నారు.

నరకయాతన అనుభవిస్తున్నాం



జహీరాబాద్ పట్టణంలోని మాణిక్‌ప్రభు వీధి నుంచి సిద్ధేశ్వరాలయం, రహ్మత్‌నగర్, అల్గోల్, పోట్టిపల్లి గ్రామాల మీదుగా ఎల్గోయి గ్రామం వరకు రోడ్డు దెబ్బతిన్నది. ఎలాంటి మరమ్మతులు చేయకపోవడంతో రాకపోకలు సాగించేందుకు నరకయాతన అనుభవిస్తున్నాం. రాత్రివేళల్లో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలి.

-నర్సింహులు, అల్గోల్



రోడ్డుపై ఆందోళన చేస్తున్న అల్గోల్ గ్రామస్థులు

రావి ఆకుపై నిజాం తలవంచిన చిత్రం

నారాయణఖేడ్, సెప్టెంబరు 16: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణానికి చెందిన లీఫ్ ఆర్టిస్టు గుండు శివకుమార్ రావి ఆకులపై సర్దార్ పటేల్ ఎదుట నిజాం నవాబ్ తలవంచిన చిత్రంతో పాటు సర్దార్ పటేల్ చిత్రాలు వేయడంతో పలువురు ఆయనను అభినందించారు.



రావి ఆకులపై వేసిన వివిధ చిత్రాలు



నర్సాపూర్ బస్‌డిపో వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థినులు

బస్సుల కోసం విద్యార్థుల ధర్నా

నర్సాపూర్, సెప్టెంబరు 16: బస్సులు లేక కళాశాలలకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ జిన్నారం మండలం గడ్డపోతారానికి చెందిన విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం నర్సాపూర్ డిపో వద్ద ధర్నా చేశారు. ఈ సదర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ మండలంలోని గడ్డపోతారం, కిష్టాయిపల్లి తదితర గ్రామాల నుంచి చదువుకునేందుకు నిత్యం ఎంతోమంది విద్యార్థులు హైదరాబాద్‌కు వెళ్తుంటారన్నారు. గతంలో నర్సాపూర్ డిపో కాకముందు హైదరాబాద్ పరిధిలోని జీడిమెట్ల డిపో బస్సులు ఇక్కడి నుంచి రాకపోకలు సాగించడంతో ఇబ్బందులు ఉండేవి కాదన్నారు. నర్సాపూర్ డిపో అయ్యాక తమ గ్రామాల నుంచి బస్సులు నడపకపోవడంతో సకాలంలో కళాశాలలకు వెళ్లలేకపోతున్నామన్నారు. తిరిగి జీడిమెట్ల డిపో బస్సులు నడిపించాలని కోరుతూ ధర్నా అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. విద్యార్థులకు మద్దతుగా గడ్డపోతారం మాజీ సర్పంచ్ శ్రీనివాస్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యంముదిరాజ్, నాయకులు ఆకులచిరంజీవి, నవీన్, కిరణ్ చారి ధర్నాలో పాల్గొన్నారు. ఈ విషయమై డిపో ఇన్‌చార్జి లక్ష్మణ్ మాట్లాడుతూ డిపో మేనేజర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఉపాధ్యాయుడి మృతి.. నేత్రాలు దానం



వెంకటస్వామి నేత్రాలను దానం చేస్తున్న కుటుంబ సభ్యులు



వెంకటస్వామి(ఫైల్)

జగదేవ్‌పూర్/గజ్వేల్, సెప్టెంబరు 16: గుండెపోటుతో ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుడు మృతి చెందగా, ఇంత దుఃఖాన్ని దిగమింగుకుని ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. ఈ సంఘటన మండలంలోని అలిరాజపేటలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే గ్రామానికి చెందిన ధ్యాప వెంకటస్వామి(42) 11 ఏళ్లుగా ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. గజ్వేల్‌లోని మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఆయన ఇటీవలే జగదేవ్‌పూర్ ఆదర్శ పాఠశాలకు బదిలీలపై వచ్చి శనివారం బాధ్యతలు తీసుకున్నారు. కాగా, సోమవారం అలిరాజపేటలోని తన ఇంట్లో కాలకృత్యాలకు వెళ్లిన ఆయనకు ఛాతిలో నొప్పి రావడంతో కుప్పకూలాడు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంకటస్వామి భార్య మంజుల జగదేవ్‌పూర్ బాలికల పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. మృతుడికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఇంత దుఃఖంలోనూ సామాజిక స్పృహతో కుటుంబ సభ్యులు లోక్ నేత్ర ట్రస్టుకు వెంకటస్వామి కళ్లను దానం చేశారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ, మండల అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, యూటీఎఫ్, టీపీటీఎఫ్ మండల అధ్యక్షులు సత్తయ్య, ప్రవీణ్, వెంకటస్వామి మృతదేహానికి నివాళులర్పించారు.

గంజాయి పట్టివేత

● నిందితుడి అరెస్టు

జహీరాబాద్ ,సెప్టెంబరు16 : పోలీసులు దాడి చేసి గంజాయిని స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశారు. జహీరాబాద్‌రూరల్ ఎస్‌ఐ ప్రసాదరావు కథనం ప్రకారం మండలంలోని హుగ్గెల్లి శివారులో శేఖాపూర్‌తండాకు చెందిన రాథోడ్ హరి అలియాస్ అర్జున్‌రాథోడ్ పవార్‌వేణు, చౌహాన్‌విజయ్, చౌహాన్ అర్జున్, చౌహాన్ సతీష్ అలియాస్ కిరణ్‌తో కలిసి కొన్నేళ్లుగా ఒరిస్సా బార్డర్ కొత్తగూడెం, బీదర్‌ల నుంచి గంజాయిని తీసుకువచ్చి జహీరాబాద్ పరిసరప్రాంతాల్లో అమ్ముతున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న పోలీసులు హుగ్గెల్లి శివారులోని షాలిమార్ హోటల్ వెనుక శిరీష వెంచర్‌లో సోమవారం 5కిలోల గంజాయిని ప్యాకెట్లుచేసి అమ్ముతున్నక్రమంలో పోలీసులు పట్టుకున్నారు. అర్జున్‌రాథోడ్‌ను అదుపులోకి తీసుకోగా.. మిగతవారు పరారయ్యారు. వీరిపై కొత్తగూడం జిల్లా మణుగురు పోలీస్ స్టేషన్‌లో కేసులున్నాయని, పరారీలో ఉన్న నిందితులను త్వరలో పట్టుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

పాతి పెట్టిన బాలుడి మృతదేహానికి రీ పోస్టుమార్టం!

● ఆసుపత్రిపై బాలుడి తండ్రి ఫిర్యాదుతో..



దశ్విక్ (ఫైల్)

హత్నూర, సెప్టెంబరు 16: మండల పరిధిలోని కొన్యాల గ్రామంలో ఇటీవల మృతి చెందిన 45రోజుల బాలుడి మృతదేహానికి మంగళవారం రీ పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు తెలిసింది. గ్రామానికి చెందిన ప్రభులింగం, అనురాధ దంపతుల కుమారుడు దశ్విక్ తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా.. తల్లిదండ్రులు సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఈ నెల 5న చేర్పించారు. చికిత్స పొందుతూ 8న మృతి చెందగా, ఆసుపత్రి వైద్యులు మాత్రం బాలుడి పరిస్థితి విషమంగా ఉందని.. నీలోఫర్ ఆసుత్రికి వెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో బాలుడి తండ్రి సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఆ బాలుడు డెంగ్యూతో మృతి చెందాడా..? మరో ఏదైనా వ్యాధితో మృతి చెందాడా..? తెలుసుకునేందుకు పూడ్చి పెట్టిన బాలుడి మృతదేహానికి మంగళవారం పోస్టు మార్టం నిర్వహించనున్నట్లు తెలిసింది.

భార్యతో గొడవపడి ఆత్మహత్యాయత్నం

● ఆస్పత్రిలో మృతి

మనోహరాబాద్, సెప్టెంబరు 16 : భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ కథనం ప్రకారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం ఏలూరుకు చెందిన మహ్మద్ నజీర్ (37)కు దండుపల్లి గ్రామానికి చెందిన నజ్మసుల్తాన్‌తో 11 ఏళ్ల క్రితం వివాహమైంది. నజీర్ భార్యతో కలిసి అత్తగారి ఊరులో అద్దె గదిలో ఉంటూ ఓ పరిశ్రమలో పని చేస్తున్నారు. కల్లుకు బానిసై నజీర్ నిత్యం తాగి వచ్చి భార్యతో గొడవపడేవాడు. ఈ నెల 9న కూడా తాగివచ్చి గొడవపడడంతో భార్య తల్లిగారి ఇంటికి వెళ్లింది. సాయంత్రం 6 గంటలకు తిరిగి రాగా.. పురుగుల మందు తాగినట్లు భర్త చెప్పాడు. దీంతో వెంటనే ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి ఎర్రగడ్డ ఈఎస్‌ఐ ఆసుపత్రికి తలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య నజ్మ సుల్తాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

బెజ్జంకి, సెప్టెంబరు 16: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గుండారం గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకున్నది. బెజ్జంకి పోలీసుల కథనం ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వెంకట్రావుపల్లికి చెందిన ఎనుసాల ముత్తయ్య (33) అనే వ్యక్తి గల్ఫ్ దేశాలకు వెళ్లి పని దొరకక తిరిగి వచ్చాడు. కొన్ని రోజులుగా వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో రూ.3 లక్షల వరకు అప్పులు కావడంతో తీసుకున్న ఎలా తీర్చాలని మనోవేదనకు గురై ఇంట్లో నుంచి వెళ్లి గుండారం గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, భార్య ఎల్లవ్వ ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

చదువుకున్న పాఠశాలకు ఏటా రూ.లక్ష విరాళం

● పూర్వ విద్యార్థి నిర్ణయం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

సిద్దిపేట అర్బన్,సెప్టెంబరు 16 : సిద్దిపేట అర్బన్ మండలం తడ్కపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు పూర్వ విద్యార్థి, చార్టెడ్ అకౌంటెంట్ జెట్టి మల్లేశం రూ.లక్షను విరాళంగా అందజేశారు. సోమవారం పాఠశాలలో 1995-96లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని ఎన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన జెట్టి మల్లేశం ప్రస్తుతం హైదరాబాదులో చార్టెడ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా జెట్టి మల్లేశం మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలలో మౌలిక వసతుల మెరుగుదల, విద్యార్థులు చదువులో రాణించేలా ప్రోత్సహించడానికి తన వంతుగా ఆర్థిక సాయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఇతరులు కూడా ముందుకు వచ్చి చేయూతనివ్వాలన్నదే తన ఉద్దేశమన్నారు. ఇందులో భాగంగా ప్రతి సంవత్సరం లక్ష రూపాయలను పాఠశాలకు విరాళంగా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఇలా పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాల బాగోగులు చూసుకోవడానికి ముందుకు వస్తే ప్రతి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఎదిగి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. ఉదార హృదయంతో పాఠశాల అభివృద్ధి కోసం ముందుకు వచ్చిన పూర్వ విద్యార్థి జెట్టి మల్లేశంను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దేవర కనకయ్య, జోగు వెంకటేశ్వర్లు, మాధవి, సువర్ణ, లత, నరేష్, రమణారెడ్డి, ఐలయ్య పూర్వ విద్యార్థులు స్కైలాబ్ రెడ్డి, రమణారెడ్డి, జానీ, గణపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత బస్సు సేవలు విస్తరణ

● ప్రత్యేక సర్వీసులు ప్రారంభించిన న్యూలాండ్ పరిశ్రమ



ఉచిత సర్వీసులో ప్రభుత్వ పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

జిన్నారం, సెప్టెంబరు 16: మహిళలు, విద్యార్థుల సౌకర్యార్థం జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని న్యూలాండ్ పరిశ్రమ యాజమాన్యం చేపట్టిన ఉచిత బస్సు సర్వీసు సేవలను మరింతంగా విస్తరించింది. జిన్నారం మండలలోని ప్రభుత్వ పాఠశాల, కళాశాల విద్యార్థుల కోసం ఇప్పటికే ఓ బస్సును నడుపుతుండగా.. వివిధ గ్రామాల మహిళలు, ఇతర పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల కోసం తాజాగా మరో బస్సు సర్వీసును ప్రారంభించింది. ఈ బస్సుల్లో నిత్యం 250 మంది విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. జిన్నారం శివారులో ఉన్న విద్యా సంస్థలకు వెళ్లేందుకు విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతుండగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చొరవతో పరిశ్రమ యాజమాన్యం బస్సు సేవలు కల్పించింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో గాయాలతో హనుమాండ్లు

అల్లాదుర్గం, సెప్టెంబరు 16 : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. ఎస్‌ఐ ప్రవీణ్ రెడ్డి కథనం ప్రకారం కామారెడ్డి జిల్లా మహ్మద్‌నగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని నడిమి తండా గిర్నితండాకు చెందిన గుగులోతు హనుమాండ్లు (42) ఆదివారం రాత్రి బైకుపై అల్లాదుర్గం మీదుగా 161 జాతీయరహదారిపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు బైకుపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని కుటుంబీకులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి సోదరుడు గుగులోతు మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

108లో కవలలు ప్రసవం



కౌడిపల్లి, సెప్టెంబరు 16: పురుటి నొప్పులతో బాధపడుతున్న తల్లిని 108లో చికిత్స నమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యలో కవలపిల్లలకు జన్మనిచ్చింది. మండలంలోని నాగ్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన నాగలక్ష్మి అనే మహిళ పురిటి నొప్పులు రావడంతో వెంటనే గ్రామానికి చెందిన ఆశ వర్కర్ సహకారంతో మెదక్ ఏరియా అసుపత్రికి తరలించారు. వైద్యుల సుచనతో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని నిలోఫర్‌కు 108 లో తరలిస్తుండగా, పురుటి నొప్పులు అధికమై కాన్పు అయ్యింది. దీంతో అంబులెన్స్‌లోనే ఇద్దరు మగ పిల్లలకు జన్మనిచ్చింది. నాగలక్ష్మి కుటుంబ సబ్యులు, గ్రామస్తులు ఆశ వర్కర్, 108 సిబ్బందిని అభినందించారు.

క్రీడలకు కోచ్‌లేరీ..?

● ఏడాది క్రితం జిమ్నాస్టిక్, గత నెల స్విమ్మింగ్ కోచ్‌లు బదిలీ
● శిక్షకులు లేని సంగారెడ్డి జిల్లా క్రీడాప్రాధికార సంస్థ
● నిరాశలో క్రీడాకారులు.. నియమించాలని వేడుకోలు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 16 : క్రీడలు, క్రీడాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ప్రభుత్వాలు, అధికారులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. జిల్లాలో ఒక్క క్రీడా శిక్షకుడు కూడా లేకపోవడంతో క్రీడాకారులు ఆటలకు దూరమవుతున్నారు. దీంతో క్రీడాభివృద్ధి కుంటుపడుతున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఒక్క కోచ్ లేని క్రీడాప్రాధికార సంస్థ..

సంగారెడ్డి జిల్లా క్రీడాప్రాధికార సంస్థలో ఒక్క కోచ్ కూడా లేరు. 2013 నుంచి పనిచేసిన ఓ జిమ్నాస్టిక్ కోచ్ ఏడాది క్రితం బదిలీ అయ్యారు. ఇక ఆ సంస్థ ఆధీనంలో స్విమ్మింగ్ పూల్ కొనసాగిస్తుండగా, దానికి 2019లో స్విమ్మింగ్ కోచ్‌ను నియమించినప్పటికీ, గత నెల 22న ఆయన కరీంనగర్‌కు డీవైఎస్‌వోగా పదోన్నతిపై వెళ్లారు. దీంతో జిల్లాలో కోచ్‌లు లేకుండా పోయారు. ఫలితంగా స్విమ్మింగ్ పూల్ ఎలాంటి కోచ్ లేకుండానే నిర్వహిస్తున్నారు.

శిక్షకులు లేక ఇబ్బందులు..

క్రీడల్లో ప్రావీణ్యం సంపాదించాలంటే శిక్షకులు అవసరం. శిక్షకులు లేకపోవడంతో నైపుణ్యం తగ్గిపోయి క్రీడా కోటలో సీట్లు, ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని పలువురు క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం శిక్షకులను నియమించి క్రీడాకారులను ప్రోత్సహించాలని క్రీడాకారులు, క్రీడా సంఘాల నాయకులు కోరుతున్నారు.



ప్రతిపాదనలు పంపాం..



జిల్లాలో కోచ్‌లు లేని మాట వాస్తవమే. ఉన్న ఒక్క స్విమ్మింగ్ కోచ్ ఇటీవల బదిలీ అయ్యారు. అన్ని క్రీడాంశాలకు సంబంధించిన కోచ్‌లను నియమించాలని ఇటీవల కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. క్రీడలు, క్రీడాభివృద్ధి కృషి చేస్తాం.

-ఖాసింబేగ్, డీవైఎస్‌వో, సంగారెడ్డి జిల్లా



సంగారెడ్డిలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ పరిధిలోని డా.బి.ఆర్.అంబేద్కర్ స్టేడియం

ప్రశాంతంగా వినాయక నిమజ్జనాలు నిర్వహించాలి


బతుకమ్మ చెరువును పరిశీలిస్తున్న అధికారులు

చేర్యాల, సెప్టెంబరు 16: గణపతి నిమజ్జనాలను పురస్కరించుకుని చేర్యాల పట్టణంలోని బతుకమ్మ చెరువు పరిసరాలను చేర్యాల మున్సిపల్ ఛైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, సీఐ శ్రీను, కమిషనర్ నాగేందర్ పరిశీలించారు. ప్రశాంతంగా గణేష్ నిమజ్జనాలను జరుపుకోవాలని కోరారు.

వినాయక నిమజ్జనాలకు డీజే అనుమతి లేదు: గౌరారం ఎస్ఐ

వర్గల్, సెప్టెంబరు 16: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వినాయకుడి నిమజ్జనానికి డీజే అనుమతి లేదని గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రతీ వినాయకుడి విగ్రహం వద్ద మండపాల ఆర్గనైజర్లు పూర్తి బాధ్యతగా ఉండాలన్నారు. నిమజ్జనం రోజులను డీజేలు పెట్టవద్దని, వృద్ధులు, వయస్సు పైబడిన వారు, చిన్నపిల్లలు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారు డీజే శబ్దాలతో ఇబ్బందులు ఎదుర్కొవల్సి వస్తుందని చెప్పారు. గుండె నొప్పి వచ్చే అవకాశం అధికంగా ఉందని, అంతేకుకుండా శబ్ద కాలుష్యం కూడా పెరిగే అవకాశం ఉన్నందున్న డీజేలను నిషేధించినట్లు చెప్పారు.


సిద్దిపేట కల్చరల్: నిమజ్జనం వద్ద డీసీపీ మల్లారెడ్డి, ఏసీపీ మధు, మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్


గజ్వేల్ రూరల్: కొడకండ్లలో వినాయకుడిని పల్లకిలో తీసుకెళ్తున్న భక్తులు


కొండపాక: మర్పడగలో కారుపై వినాయకుడిని ఊరేగిస్తున్న చిన్నారులు

గంగమ్మ ఒడికి గణనాథులు

- మొదలైన నిమజ్జనాలు
- అన్ని ఏర్పాట్లు చేసిన అధికారులు

చేర్యాల, సెప్టెంబరు 16: కొమురవెల్లి మల్లికార్జున్ ఆలయంలో నిర్వహించిన గణపతి నవరాత్రోత్సవాలలో భాగంగా సోమవారం గణపతిని ఆలయపురవీధుల్లో ఊరేగించారు. అనంతరం దేవస్థానంలోని ధర్మగుండంలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి బాలాజీ, ప్రధాన అర్చకులు స్థానాచార్యులు, అర్చకులు, పర్యవేక్షకులు సురేందర్, ఆలయ సిబ్బంది, వేద పాఠశాల విద్యార్థులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● **కొండపాక:** మండలంలోని సిరసనగండ్ల గ్రామంలో యువ చైతన్య మిత్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. అలంకరించిన వాహనంలో వినాయకుడిని ఊరేగించి స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. మండలంలోని మర్పడగలో హనుమాన్ ఆలయ సమీపంలో కొంతమంది చిన్నారులు వినాయకుడి నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో చేశారు. నిమజ్జనం రోజు అదే వీధిలో ఉన్న శ్రీకాంత్ అనే యువకుడి సహకారం తీసుకుని వారికున్న కారును అలంకరించి కారు పై వినాయకుడి ఊరేగించి చెరువులో నిమజ్జనం చేశారు.

● **గజ్వేల్ రూరల్:** గజ్వేల్ మండల పరిధిలోని కొడకండ్ల, బూర్గుపల్లి, రిమ్మనగూడ, దాతర్‌పల్లి గ్రామాల్లో వివిధ యూత్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథులను నిమజ్జనం చేశారు.

● **సిద్దిపేట కల్చరల్:** సిద్దిపేట కాకతీయ టెక్నో స్కూల్లో ఏర్పాటుచేసిన గణపతి నిమజ్జనంలో డీసీపీ మల్లారెడ్డి, ఏసీపీ మధు, మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్, మాజీ మున్సిపల్ ఛైర్మెన్ రాజనర్సు పాల్గొన్నారు. కోమటిచెరువు వద్ద కొబ్బరికాయ కొట్టి క్రేన్ సహాయంతో వినాయకుడి నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జగ్గు మల్లారెడ్డి, ప్రిన్సిపాల్ కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **హుస్నాబాద్:** హుస్నాబాద్‌లో గణేష్ నిమజ్జన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. బోలో గణేష్ మహారాజ్‌కి జై.. అంటూ చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా గణపతి నిమజ్జన శోభాయాత్రలో పాల్గొన్నారు. డప్పుచప్పుళ్ళు, బ్యాండ్ మేళాలు, కోలాటాలు మధ్య యువకులు, మహిళలు నృత్యాలు చేస్తూ ఊరేగింపులో పాల్గొన్నారు. ఎల్లమ్మ చెరువులో ఘణనాథులను నిమజ్జనం చేశారు.

లడ్డూ వేలం పాటలు

రాయపోల్: మండలంలోని బేగంపేటలో నవయుగ యూత్ ఏర్పాటు చేసిన వినాయకుని చేతిలోని లడ్డూని ఆదివారం రాత్రి వేలం వేయగా గ్రామానికి చెందిన దాచపల్లి రంజిత్‌కుమార్ రూ.82వేలకు దక్కించుకున్నాడు. కార్యక్రమంలో నవయుగ యూత్ సభ్యులు బాల్‌రాజు, ప్రభాకర్, ప్రవీణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కొండపాక: మండలంలోని సిరసనగండ్ల గ్రామంలో యువ చైతన్య మిత్రమండలి ఆధ్వర్యంలో గణేష్‌డి లడ్డూను వేలం వేయగా గ్రామానికి చెందిన నందాల సుధాకర్ రూ.37,116 దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు మిత్రమండలి అధ్యక్షుడు చెంది ఆంజనేయులు లడ్డూను అందజేశారు.



వినాయక నిమజ్జనం సందర్భంగా సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి బుధవారం 10 గంటల వరకు మద్యం షాపులను మూసివేయాలని అధికారులు ఆదేశించారు. దీంతో పట్టణంలో కొన్ని చోట్ల మద్యం కోసం జనాలు ఎగబడ్డారు. ముందస్తుగా మద్యం కొనుగోలు చేసి తీసుకెళ్లారు.

- సిద్దిపేట ఫొటోగ్రాఫర్

సీఎం రేవంత్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు


చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణకు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

చిన్నకోడూరు/నంగునూరు, సెప్టెంబరు 16: గాంధీభవన్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని సోమవారం బీఆర్‌ఎస్వీ, బీఆర్‌ఎస్‌వై నాయకులు చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం మండలాధ్యక్షుడు గుజ్జ రాజు, యువజన విభాగం మండలాధ్యక్షుడు గుండవెల్లి వేణు మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండి రేవంత్‌రెడ్డి దుర్భాషలాడుతూ మాట్లాడడం సరికాదన్నారు. మాట్లాడిన మాటలను సీఎం రేవంత్‌రెడ్డి వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధాకర్, లింగం, ఆనంద్, భానుచందర్, రాజశేఖర్ రెడ్డి, శ్రీకాంత్, ప్రేమ్, జగన్ తదితరులు పాల్గొన్నారు. మాజీమంత్రి హరీశ్‌రావుపై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై రాజగోపాలపేట పోలీస్‌స్టేషన్‌లో బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం ఫిర్యాదు చేశారు.

రోడ్డుకు ఇరువైపులా కమ్ముకున్న చెట్ల కొమ్మలు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, రైతులు

చిన్నకోడూరు, సెప్టెంబరు 16: మండల కేంద్రం నుంచి ఇబ్రహీంనగర్ గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డుకు ఇరువైపులా చెట్ల కొమ్మలు కమ్ముకున్నాయి. చిన్నకోడూరు గ్రామ శివారులోని శ్రీ శేరిపల్లి వీరాంజనేయ స్వామి ఆలయానికి వెళ్లే భక్తులతో పాటు, పలు గ్రామాలకు వెళ్లే వాహనాదారులు, వ్యవసాయ బావుల వద్దకు వెళ్లే రైతులు ఆ రోడ్డు పైనిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాకాలం కావడంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలు, పిచ్చి మొక్కలు, గడ్డిపొదలు ఏపుగా పెరిగి రోడ్డు పైకి రావడంతో వాహనదారులు, రైతుల రాకపోకలకు ఆటంకం కలుగుతున్నది.


చిన్నకోడూరు-ఇబ్రహీంనగర్ రోడ్డులో కమ్ముకున్న చెట్ల కొమ్మలు, పిచ్చి మొక్కలు

వాహనదారులు, రైతులకు తప్పని తిప్పలు

రోడ్డుకు ఇరువైపులా చెట్ల కొమ్మలు, పిచ్చి మొక్కలు, గడ్డిపొదలు కమ్ముకోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో రోడ్డు పై ప్రయాణం ప్రమాదకరంగా మారిందని, ఎదురుగా వచ్చే వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా కమ్ముకున్న చెట్ల కొమ్మలు, పిచ్చి మొక్కలు, గడ్డిపొదలను తొలగించాలని వాహనదారులు, రైతులు కోరుతున్నారు.

బైరాన్‌పల్లి చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి

దూళిమిట్ట, సెప్టెంబరు 16: బైరాన్‌పల్లి చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని, నిజాం రజాకార్లను తరిమికొట్టి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఎర్రజెండా పట్టి ఎంతోమంది అమరులైతే, బీజేపీ చరిత్రను వక్రీకరిస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి ఆరోపించారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బైరాన్‌పల్లి గ్రామంలోని బురుజు వద్ద సీపీఎం నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభలో జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి మాట్లాడుతూ.. రైతాంగ సాయుధ పోరాటం ఎర్రజెండా నాయకత్వంలోనే జరిగిందన్నారు. ఈ పోరాటం ప్రపంచ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగ్గ పోరాటమన్నారు. ఎర్రజెండా బిడ్డలు అమరులైన ఈ ప్రాంతాన్ని పుణ్యస్థలంగా భావించాలని, బైరాన్‌పల్లి చరిత్రను భావి తరాలకు అందించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠ్యపుస్తకాల్లో చేర్చి ఈ ప్రాంతాన్ని పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి పరచాలన్నారు. సాయుధ పోరాట అమరవీరులకు నిజమైన వారసులు ఎర్రజెండ బిడ్డలే అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మద్దూరు మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, ఎల్లయ్య, జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట్‌మావో, బద్దిపడగ కృష్ణారెడ్డి, బొప్పరి రవికుమార్, తాడూరి రవికుమార్, దాసరి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


బైరాన్‌పల్లి బురుజు వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


కనకయ్య(ఫైల్)

చేర్యాల, సెప్టెంబరు 16: ఆత్మహత్యయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన మండలంలోని ఆకునూరు గ్రామంలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శెట్టి కనకయ్య (53) మద్యానికి బానిసై ఏ పని చేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. ఈ నెల 14న ఇంట్లో ఎవరు లేని సమయంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. పనిమీద చేర్యాలకు వెళ్లి వచ్చిన చిన్న కూతురు తండ్రి వాంతులు చేసుకోవడాన్ని గమనించి వ్యవసాయ బావి వద్దకు వెళ్లిన తల్లికి సమాచారం అందించడంతో వెంటనే చికిత్స కోసం చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భార్య శెట్ట లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధ్యాయుల బదిలీ

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 16: ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా 15 మంది ఉపాధ్యాయులు వివిధ పాఠశాలలకు బదిలీ అయినట్లు సిద్దిపేట రూరల్ మండలం ఇర్కోడు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బుచ్చిబాబు సోమవారం తెలిపారు. 15 మంది ఉపాధ్యాయులు జిల్లాలోని వివిధ పాఠశాలలకు బదిలీ అయ్యారని, ఇర్కోడు ఆదర్శ పాఠశాలకు 18 మంది ఉపాధ్యాయులు బదిలీపై వచ్చారని తెలిపారు.

దరఖాస్తులకు గడువు పెంపు

వర్గల్, సెప్టెంబరు 16: వర్గల్ మండల కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయం 2025-2026 విద్యా సంవత్సరాని 6వ తరగతి ప్రవేశానికి గాను ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 23వ తేది వరకు అవకాశం కల్పించినట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ రాజేందర్ సోమవారం తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు పూర్తి సమాచారం నవోదయ వెబ్‌సైట్‌లో చూడాలన్నారు. 6వ తరగతి ప్రవేశానికి గాను దరఖాస్తు చివరి తేది ఈ నెల 16వ తేదిన ఉండగా పరిపాలనా కారణాల రీత్యా ఈ నెల 23వ తేది వరకు పొడిగించినట్లు తెలిపారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

గజ్వేల్, సెప్టెంబరు 16: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ ఉద్యోగి మహ్మద్ పాషాను బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. ప్రజ్ఞాపూర్ గ్రామపంచాయతీగా ఉన్న సమయంలో 30ఏళ్ల పాటు కారోబార్‌గా పనిచేసిన పాషా తండ్రి మహ్మద్ బాషుమియా మృతిచెందిన విషయం తెలుసుకుని, వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఆయనవెంట నాయకులు మర్కంటి కనకయ్య, చేలిరెడ్డి వెంకట్రామారెడ్డి తదితరులున్నారు.

గందరగోళంగా వార్డులవారీ ఓటరు జాబితా

రేగోడు సెప్టెంబరు 16: గ్రామపంచాయతీల ఎన్నికల కోసం గ్రామాలు, వార్డులవారీగా ఓటరు జాబితాను ఆయా గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేశారు. వార్డుల వారీగా చేసిన ఓటర్ జాబితాలో కుటుంబాల ఓటర్ల విషయంలో గందరగోళం నెలకొన్నది. గత పంచాయతీ ఎన్నికల్లో క్రమం ప్రకారం ఉన్న ఓటరు జాబితా తారుమారు కావడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా నమోదు చేసుకున్న ఓటర్లను ఆయా వార్డుల వారీగా కుటుంబ సభ్యుల జాబితాలో చేర్చాల్సిందిపోయి కుటుంబ సభ్యులను వేర్వేరు వార్డుల్లో ఓటర్లుగా నమోదు చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రేగోడులో 12 వార్డులు ఉండగా ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లను 9వ వార్డు, 12వ వార్డులో చేర్చారు. ఓటరు జాబితా సవరణకు ఈ నెల 23 వరకు అవకాశముందని, గ్రామ కార్యదర్శులకు ఫిర్యాదు చేస్తే సవరణ చేస్తారని మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తెలిపారు.

కాంగ్రెస్ ఓబీసీ సెల్ మండల ప్రధాన కార్యదర్శిగా కరుణాకర్


నియామకపత్రం అందజేస్తున్న చిరంజీవి యాదవ్

చిన్నకోడూరు, సెప్టెంబరు 16: కాంగ్రెస్ ఓబీసీ సెల్ మండల ప్రధాన కార్యదర్శిగా చిన్నకోడూరు గ్రామానికి చెందిన కోనేటి కరుణాకర్ నియామకమయ్యారు. ఈ మేరకు సోమవారం చిన్నకోడూరు మండల కేంద్రంలో కాంగ్రెస్ ఓబీసీ సెల్ మండలాధ్యక్షుడు బంక చిరంజీవి యాదవ్ నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు గుడిమల్ల మల్లేశం, ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్‌రాజు, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు ఎల్లయ్య, సీనియర్ నాయకుడు పోశమల్లు, ఎల్లయ్య, గణేష్, బాబు మియా, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం


గురువులతో పూర్వ విద్యార్థులు

చేర్యాల, సెప్టెంబరు 16: కొమురవెల్లి మండలంలోని పోసానిపల్లి గ్రామంలో 2003-04 7వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు సన్మానించారు. పాఠశాలకు తమవంతుగా రూ.10వేలను అందించారు. కార్యక్రమంలో రవి, ఎర్రోళ్ల రాజు, ప్రధానోపాధ్యాయుడు రామ్ కిషన్, సోమ రమేష్ గుప్తా, రాజ్యలక్ష్మి, బూరుగు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం

- మాజీ జడ్పీటీసీ మంగమ్మ రామచంద్రం


చేబర్తిలో అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

మర్కుక్, సెప్టెంబరు 16: అన్నదానం మహాదానం అని మాజీ జడ్పీటీసీ మంగమ్మ రామచంద్ర అన్నారు. మండల పరిధిలోని చేబర్తిలో చేబర్తి యూత్ ఆధ్వర్యంలో గణేష్ మండపం వద్ద అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మర్కుక్ మండల మాజీ జడ్పీటీసీ మంగమ్మ రామచంద్రం, మాజీ వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్, ఉపసర్పంచ్ అశోక్‌స్వామిలు హాజరయ్యారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి: బీజేపీ

నారాయణఖేడ్, సెప్టెంబరు 16: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ మండల అధ్యక్షుడు సిందోల్ దశరథ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1948 సెప్టెంబరు 17న సర్దార్ వల్లభాయ్ పటేల్ చేపట్టిన పోరాటం ఫలితంగా, తెలంగాణకు విముక్తి లభించిందన్నారు. ప్రభుత్వం అధికారికంగా విమోచన వేడుకలు నిర్వహించకుండా, ప్రజా పాలన దినోత్సవాన్ని ప్రకటించడం ఎంఐఎం నాయకులను తృప్తి పర్చడం కోసమేనన్నారు. సర్దార్‌పటేల్ విగ్రహాన్ని హైదరాబాద్‌లో సైతం ఏర్పాటు చేయాలన్నారు.

సర్పంచులకు పెండింగ్ బిల్లులను చెల్లించాలి

- సర్పంచుల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు బాల్‌రాజు


మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి మాట్లాడుతున్న గోపాలస్వామి

మిరుదొడ్డి, సెప్టెంబరు 16: 9 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బిల్లులను వెంటనే మంజూరు చేయాలని మిరుదొడ్డి సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు బాల్‌రాజు డిమాండ్ చేశారు. మిరుదొడ్డిలో మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు రాజు, బీఆర్‌ఎస్ ముఖ్యనాయకుడు తోటకమలాకర్‌రెడ్డితో కలిసి సోమవారం మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులను చెల్లించకుండా ప్రస్తుత ప్రభుత్వం అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నదని మండిపడ్డారు. తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా సర్పంచులను ఏకం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. వారివెంట బీఆర్‌ఎస్ నాయకులు లింగం, బాల్‌నర్సింహులు, శ్రీనివాస్ తదితరులున్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు..

మిరుదొడ్డి, సెప్టెంబరు 16: మధ్యాహ్న భోజన కార్మికులకు రావాల్సిన బిల్లులను ప్రభుత్వం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి డిమాండ్ చేశారు. మిరుదొడ్డిలో సోమవారం మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు నెలనెలా బిల్లులను చెల్లించకపోవడం వల్ల వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే అంగన్‌వాడీ కేంద్రాలను ఏ విధంగా గుడ్లను సరఫరా చేస్తుందో అదేమాదిరిగా ప్రభుత్వ పాఠశాలలకూ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మిరుదొడ్డి కార్యదర్శి అంజయ్య, మధ్యాహ్న భోజన కార్మికులు పద్మ, చంద్రయ్య, లావణ్య, భాగ్యమ్మ, లక్ష్మి, లలిత, బాలవ్వ తదితరులున్నారు.

ఎస్సీ వర్గీకరణ కమిటీ నుంచి ఆ ఇద్దరిని తొలగించాలి

- ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ గుడిమల్ల సత్తయ్య

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 16: ఎస్సీ వర్గీకరణ మంత్రుల కమిటీ నుంచి దామోదర రాజనర్సింహ, మల్లు రవిని తొలగించాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ గుడిమల్ల సత్తయ్య డిమాండ్ చేశారు. నారాయణరావుపేట మండల కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ వ్యేతిరేక పోరాట సమితి మండల కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ప్రతినిధులు సత్తయ్య, ర్యాకం శ్రీరాములు, కోదాది శ్రీనివాస్‌లు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ కమిటీతో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా చేగురి కృష్ణ, ఉపాధ్యక్షులుగా దాసరి సుందర్, చేగురి నర్సింహులు, దోతి బాలయ్య, ప్రధాన కార్యదర్శిగా తూనికి మహేష్, కోశాధికారిగా మహంకాళి బిక్షపతి, ప్రచార కార్యదర్శిగా చేగురి నాగరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.


ఎస్సీ వర్గీకరణ వ్యేతిరేక పోరాట సమితి మండల నూతన కమిటీ సభ్యులు

ఆపదలో ఉన్న వారికి అండగా సీఎం సహాయనిధి

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు 16: ఆపదలో ఉన్న వారికి అండగా సీఎం సహాయనిధి ఉపయోగపడుతుందని కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. సిద్దిపేట పట్టణంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో సోమవారం నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లికి చెందిన లచ్చయ్యకు రూ. 60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆయన అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అంజిరెడ్డి, రాజేశం గౌడ్, రాగుల అశోక్, అంబటి విటల్, పల్లె పరుశురాములు, కలీమ్, దాస అంజయ్య, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.


సిద్దిపేట టౌన్: లబ్ధిదారుడికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న పూజల హరికృష్ణ

● **రాయపోల్:** మండలంలోని కొత్తపల్లికి చెందిన నలుగురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కొత్తపల్లికి చెందిన మంద నారాయణకు రూ. 11వేలు, కమ్మరి నవీన్‌చారికి రూ. 10వేలు, కాళ్ల ప్రవీణ్‌కు రూ. 10వేలు, పొన్నమైన నవనీతకు రూ. 5వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల తాజా మాజీ ఎంపీపీ అనిత భర్త, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కల్లూరి శ్రీనివాస్ అందజేశారు. చెక్కుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.


రాయపోల్: కొత్తపల్లిలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

కేంద్ర మంత్రి బండి సజయ్‌ని కలిసిన ఎస్జీటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు


సంజయ్‌తో ఎస్జీటీయూ నాయకులు

వర్గల్/గజ్వేల్, సెప్టెంబరు 16: ఎస్జీటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కరీంనగర్ పట్టణంలో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ని ఎస్జీటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు కలిశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఓటు హక్కు కల్పించాలని విజ్ఞప్తి చేస్తూ వినతి పత్రం అందజేశారు. ఓటు హక్కు అంశం తన దృష్టిలో ఉందని, తప్పని సరిగా ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించే బాధ్యత తనదని మంత్రి హామి ఇచ్చినట్లు ఎస్జీటీల సంఘం వర్గల్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రీధర్‌రెడ్డి, ప్రవీన్‌రెడ్డి, సుధాకర్, వర్గల్ మండల కార్యదర్శి మొహినోద్దిన్ తదితరులు ఉన్నారు.

బీసీ కులగణన చేయడం హర్షణీయం


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా నాయకులు

చేర్యాల, సెప్టెంబరు 16: బీసీల కులగణన హర్షణీయమని, కుల గణనతో బీసీలకు ఎంతో మేలు చేకూరుతుందని బీసీ సంఘం జిల్లా నాయకులు శవల్ల రాజయ్య , బోయిన రాజు తెలిపారు. చేర్యాల మండల కేంద్రంలో కొత్త బస్టాండ్ ఆవరణలో సోమవారం ఓ హోటల్లో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని బీసీ సంఘాల తరఫున రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో బీసీ కులగణన తీర్మానం చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ బండారి కనకయ్య, బీసీ నియోజకవర్గ నాయకులు అందె అశోక్, ఆరె సాయిలు, జంగిలి యాదగిరి, కర్రె నర్సింహులు, శెట్టి సిద్దిరాములు, మ్యాక యాదయ్య, ఎగుర్ల ఎల్లయ్య, బండారి అంజయ్య పాల్గొన్నారు.

అర్హులైన ఎస్సీల అభివృద్ధికి కృషి చేస్తా

- ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నగరి ప్రీతం


రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌తో కాంగ్రెస్ దౌల్తాబాద్ మండల నాయకులు

దౌల్తాబాద్, సెప్టెంబరు 16: ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన వారికి రుణాలు అందజేసి ఎస్సీల అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రీతం పేర్కొన్నారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ఆయన్ను హైదరాబాద్‌లో దౌల్తాబాద్ మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మద్దెల స్వామి ఆధ్వర్యంలో సోమవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనవెంట కాంగ్రెస్ నాయకులు పడాల మల్లేశం, దొమ్మట గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు స్వామి, మద్దెల శ్రీకాంత్, గుగులోత్ రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'స్వభావ స్వచ్ఛత- సంస్కార స్వచ్ఛత'

- వర్గల్ ఎంపీడీవో విజయలక్ష్మి

వర్గల్, సెప్టెంబరు 16: నేటి నుంచి అక్టోబరు 2వ తేది వరకు స్వచ్ఛతాహి సేవ 2024 స్వభావ స్వచ్ఛత- సంస్కార స్వచ్ఛత పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు వర్గల్ ఎంపీడీవో విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. అందులో భాగంగా మూడు కేటగిరిల్లో పక్షోత్సవాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజలను భాగస్వామ్యం చేయడం, సంపూర్ణ స్వచ్ఛతను సాధించడం, సఫాయి మిత్ర సురక్ష, పారిశుధ్య సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు, బీమా పత్రాలు అందించడం వంటి కార్యక్రమాలు పక్షోత్సవాలలో నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు.